సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

స్మార్ట్ చదువులు

ఇది కదా అభివృద్ధి

- తోటగరువు జెడ్పీ హైస్కూల్‌లో డిజిటల్ విద్యా బోధన
- రూ.1.47 కోట్లతో 46 ఐఎఫ్‌పీల ఏర్పాటు
- చాక్‌పీస్, బ్లాక్ బోర్డులకు స్వస్తి
- విద్యార్థుల్లో పెరిగిన ఆసక్తి

> ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యమిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యా బోధన అందిస్తున్నారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా సర్కారు బడులను ఆధునీకరిస్తున్నారు. కొత్త భవనాలు, అదనపు గదుల నిర్మాణం చేపట్టడంతోపాటు డిజిటల్ విద్యా బోధనకు శ్రీకారం చుట్టారు.

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిజిటల్ బోధన విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా మారింది. ఇక్కడ చాక్ పీస్, బ్లాక్ బోర్డు బోధనకు స్వస్తి చెప్పి స్మార్ట్‌గా పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. ఇందులో భాగంగా తోటగరువు హైస్కూల్‌లో 'ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్'(ఐఎఫ్‌పీ–స్మార్ట్ టీవీ)లు ఏర్పాటు చేశారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ఈ విధానం అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు స్మార్ట్ టీవీలతో విద్యాబోధన చేస్తున్నారు.

46 స్మార్ట్ టీవీలు: రూ.1.47 కోట్లు

ఆరిలోవ ప్రాంతంలో ఇదొక్కటే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కావడంతో ఎక్కువ మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు 1,714 మంది విద్యార్థులు ఉన్నారు. వీరి కోసం పాఠశాలకు 46 ఐఎఫ్‌పీ టీవీలు కేటాయించారు. వాటిలో ఈ ఏడాది జూన్‌లో 32 ఐఎఫ్‌పీలు అమర్చారు. ఇటీవల మరో 14 ఐఎఫ్‌పీలు తరగతి గదుల్లో ఏర్పాటు చేశారు. వీటి ధర ఒక్కొక్కటీ రూ 3.20 లక్షలు ఉంటుందని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ పాఠశాలలో ఐఎఫ్‌పీ టీవీలకు రూ.1.47 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసింది.

ఎంతో సులువు..

ఎన్నో ఉపయోగాలు స్మార్ట్ టీవీ, ఫ్లిప్ పెన్‌ల ద్వారా ఉపాధ్యాయులు సులువుగా పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. దీని వల్ల విద్యార్థులకు మరింత సులువైన విద్యా బోధన అందుతోంది.

- ఉపాధ్యాయులపై సుద్ద ముక్క నుంచి వచ్చే దూలి ఉండదు.
- డస్టర్ ఉపయోగించి తుడవాల్సిన పనిలేదు.
- కేవలం ఫ్లిప్ పెన్‌తో గాని, ఏదైనా పెన్సిల్ వెనుక భాగంతో గాని ఈ టీవీ స్క్రీన్‌పై రాసుకోవచ్చు. మళ్లీ చేతితోనే శుభ్రంగా తుడిచేయవచ్చు. రాసినది చేతికి కూడా అంటదు.
- దీనిలో ఉన్న ఆప్షన్లు వినియోగించి పది రంగుల్లో స్క్రీన్‌పై అక్షరాలు రాయవచ్చు.
- దీనిలో ఏర్పాటు చేసిన లైటింగ్ సిస్టం వల్ల రాసిన పదాలు విశాలమైన తరగతి గదిలో కూడా ఆఖరి బెంచీలో బోర్డుకు దూరంగా కూర్చొన్న విద్యార్థులకు సైతం స్పష్టంగా కనిపిస్తుంది.
- ఉపాధ్యాయుడు దీని నుంచి కొన్ని అంశాలను పెన్ డ్రైవ్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొని విద్యార్థులకు పాఠాలు బోధించవచ్చు.
- దీనికి ఏర్పాటు చేసిన ఇంటర్నెట్ సదుపాయం ద్వారా పాఠ్యాంశాలను బోధించడంతోపాటు దేశం, రాష్ట్రంతోపాటు అంతర్జాతీయంగా ప్రస్తుతం జరుగుతున్న సంఘటనలు, గతంలో జరిగిన సంఘటనలు, విషయాలు గురించి విద్యార్థులకు విజువల్ ద్వారా చూపించే వీలుంది.
- తరగతి గదిలో ఉంటుండగానే బయట ప్రపంచంలో ఏం జరుగుతుందో విద్యార్థి తెలుసుకోవచ్చు.
- ఉపాధ్యాయులు ఓ పక్క పాఠం బోధిస్తుండగా దాని నెట్ ద్వారా మరో పక్క దానికి సంబంధించిన అంశాలను దీనిపై చూపించవచ్చు.
- ఇది గణితం, భౌతిక, జీవ, సాంఘిక శాస్త్రాల బోధనకు చాలా అనువైనది.



క్లాస్ రూంలో ఏర్పాటు చేసిన ఐఎఫ్‌పీ–స్మార్ట్ టీవీ



తోటగరువు జెడ్పీ హైస్కూల్‌లో స్మార్ట్ టీవీ ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

చాలా సులువుగా అర్థమవుతోంది



ఐఎఫ్‌పీలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. టీచర్లు వీటి ద్వారా పాఠాలు బోధిస్తున్నప్పుడు చాలా సులువుగా అర్థమవుతోంది. జగనన్న విద్యా కానుక కిట్లు ఇచ్చి, టీవీల ద్వారా పాఠాలు చెబుతున్నారు. మాకు ఇది కొత్తగా ఉండటంతోపాటు టీవీ చూసుకుంటూ పాఠం వింటున్నట్లు ఉంది.

– కె.వందన, టెన్త్ విద్యార్థిని

ఎక్కువ సమయం వినాలనిపిస్తోంది



ఐఎఫ్‌పీల ద్వారా టీచర్లు పాఠాలు చెబుతున్నప్పుడు ఎక్కువసేపు వినాలనిపిస్తోంది. పాఠం చెబుతుండగా ఒకపక్క రాసిన అంశాలను మరో పక్క నెట్ ద్వారా స్క్రీన్‌పై చూపిస్తున్నారు. మాకు చాలా సులువుగా ఉంటుంది. మ్యాథ్స్, సైన్స్, సోషల్ చాలా సులువుగా అర్థమవుతున్నాయి.

– పి.దినేష్‌కృష్ణ, టెన్త్ విద్యార్థి

పాఠ్యాంశాల బోధనకు ఎంతో మేలు



ఐఎఫ్‌పీ(స్మార్ట్ టీవీ)ల ద్వారా అన్ని సబ్జెక్టుల్లో బోధించడానికి ఎంతో ఉపయోగకరగా ఉంది. వీటి ద్వారా పాఠ్యాంశాలు బోధించేటప్పుడు విద్యార్థులు ఆశక్తిగా వింటున్నారు. గణితం, భౌతిక, రసాయన శాస్త్రాల బోధన మరింత సులువుగా ఉంటుంది. బ్లాక్ బోర్డుపై బోధించే అవసరం లేదు.

– పి.సురేష్‌బాబు, గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు

అన్ని విభాగాల బోధనకు ఉపయుక్తం



సాంఘిక శాస్త్రంలో అన్ని విభాగాల బోధనకు ఐఎఫ్‌పీలు చాలా ఉపయుక్తంగా ఉన్నాయి. మ్యాప్ పాయింట్లు, చరిత్ర బోధనకు మరింత వీలుగా ఉంది. చరిత్ర బోధించే సమయంలో దీని ద్వారా విద్యార్థులకు గతంలో లైవ్ చూపించవచ్చు. ఇది ఎంతో మేలైన విధానం.

– పి.రూపకళ, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని

క్లుప్తంగా

వ్యక్తిత్వ వికాసంపై ప్రసంగం



ప్రొఫెసర్ మదన్‌మోహన్‌ను సత్కరిస్తున్న విభాగ ఆచార్యులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం హ్యూమన్ జెనిటిక్స్ విభాగంలో వ్యక్తిత్వ వికాసంపై శనివారం అతిథి ప్రసంగం నిర్వహించారు. ఏయూ ఐఏఎస్ఈ విశ్రాంత ఆచార్యుడు ఎం.మదన్‌మోహన్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం అతిథిని విభాగం ఆచార్యులు సత్కరించారు. కార్యక్రమంలో హ్యూమన్ జెనిటిక్స్ విభాగాధిపతి ఆచార్య వి.లక్ష్మి, ఆచార్య పద్దయ్య, బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ, ఫుడ్–న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్ విభాగ బోధన సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవవైవిధ్య ఉద్యానవనం సందర్శన



ఉద్యానవనంలో విద్యార్థుల సందడి

ఏయూక్యాంపస్: పెదవాల్తేరులోని జీవవైవిధ్య ఉద్యానవనాన్ని శనివారం పెన్ స్కూల్‌కి చెందిన 100 మంది విద్యార్థులు సందర్శించారు. మొక్కల ప్రత్యేకతలు, ఔషధ గుణాలు, వైవిధ్యతలను పార్క్ నిర్వాహకులు డాక్టర్ మంథా రామమూర్తి వివరించారు. పుస్తకాల్లో చదువుకునే విభిన్న జాతుల వృక్షాలను ప్రత్యక్షంగా వీక్షించడంపై విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

బుల్లయ్య కళాశాలలో క్విజ్ పోటీలు



క్విజ్ పోటీలో పాల్గొన్న జూనియర్ కళాశాలల విద్యార్థులు

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీ స్థాపించి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కళాశాల వాణిజ్యం, మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో శనివారం క్విజ్ ప్రిలిమనరీ పోటీ నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థులు 34 టీములుగా ఏర్పడి, మొత్తం 185 మంది పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. జనవరి 5న క్విజ్ ఫైనల్ పోటీ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బుల్లయ్య కళాశాల ప్రిన్సిపాల్స్, వాణిజ్య, మేనేజ్‌మెంట్ విభాగం అధిపతులు, జూనియర్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో మహా అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ఏయూక్యాంపస్: పెదవాల్తేరులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం మహా అన్నదానం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రతి ఏటా ముక్కోటి ఏకాదశి అనంతరం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. చినవాల్తేరు, పెదవాల్తేరు. జాలరిపేట, లాసన్స్ బే కాలనీ తదితర ప్రాంతాల వారు స్వామిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పండరీభాయి, సభ్యులు ఆర్.దశరథ రామయ్య, జి.సత్యనారాయణ, బర్ల మంగరాజు, ఎం.పద్మజ, కె.వరప్రసాద్ రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

లయన్స్ క్లబ్ చేయూత

- కృష్ణా జూనియర్ కాలేజీ విద్యార్థుల ఫీజుల చెల్లింపు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన పేద విద్యార్థుల ఫీజుల కోసం లయన్స్ క్లబ్ రూ.18,700 అందించింది. కాలేజీ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగమణికి లయన్స్ క్లబ్ ప్రతినిధులు చెరుకు శ్రీరామూర్తి, ఎం.రంగబాబు, ఎం.సురేష్, జి.వీరభద్రరావు నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న 34 మంది విద్యార్థుల పరీక్ష ఫీజుల కోసం ఒక్కొక్కరికీ రూ.550 చొప్పన రూ.18,700 అందించామని తెలిపారు. ప్రిన్సిపాల్ నాగమణి మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉన్నత చదువులు చేయూత అందించి లయన్స్ క్లబ్ ప్రతినిధులు సేవా నిరతిని చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసినాయుడు, అధ్యాపకులు సూర్యకుమారి, వేదవ్యాస్, మురళీకృష్ణ, ఆర్.పి.నాయుడు పాల్గొన్నారు.



ఫీజులు చెల్లించిన విద్యార్థులతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, కళాశాల యాజమాన్యం

అ'పూర్వ' కలయిక

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 1963–66లో డిగ్రీ(స్పెషల్) చదివిన పలువురు పూర్వ విద్యార్థులు శనివారం వర్సిటీని సందర్శించారు. ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమతను కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తాము 60 ఏళ్ల కిందట ఏయూలో చదువుకున్నామని, వర్సిటీని సందర్శించడం తమకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆచార్య పి.రాజగణపతి, ఆచార్య వి.విశ్వనాథం, ఆచార్య పి.శశిభూషణరావు, జి.వి.వి స్వామి, వి.జ్వాలప్రసాద్, పి.సూర్య భగవాన్, కె.వి. రామరాజు, జి.శ్రీహరిరావు పాల్గొన్నారు.



ఆచార్య సమతతో పూర్వ విద్యార్థులు

రూ.95 లక్షలతో బృందావనం పార్కు ఆధునికీకరణ

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్ – 11లో ఆధునికీకరించిన బృందావనం పార్కును నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ప్రారంభించారు. శనివారం సాయంత్రం జోన్ – 3 ఉన్నతాధికారులు, పార్టీ నాయకులు, కాలనీ నివాసితుల సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ హరివెంకట కుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. దశాబ్దాలుగా ఆధునీకరణకు నోచుకోని బృందావనం పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. రూ.95 లక్షలతో మోడల్ పార్కుగా తీర్చిదిద్దామన్నారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 19వ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, జోన్ – 3 ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.



పార్కు ప్రారంభిస్తున్న మేయర్ హరివెంకట కుమారి తదితరులు

పరిసరాల శుభ్రతకు నడుంబిగించిన కార్పొరేటర్లు



9వ వార్డులో చెత్త ఊడుస్తున్న కార్పొరేటర్ స్వాతి

ఆరిలోవ: జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకట కుమారి పిలుపు మేరకు పరిసరాల పరిశుభ్రతకు శనివారం కార్పొరేటర్లు నడుం బిగించారు. పారిశుధ్యంపై ప్రజల్లో చైతన్యం కలిగించేలా చీపుర్లు, గడ్డపార పట్టి చెత్తను ఊడ్చి పరిసరాలను శుభ్రం చేశారు. 9వ వార్డులో పేరుకుపోయిన చెత్తను కార్పొరేటర్ స్వాతి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తరలించారు. 13వ వార్డు ఆరిలోవ కాలనీలో కార్పొరేటర్ కెల్ల సునీత, స్థానిక నాయకులతో కలిసి చెత్త కుప్పలు ఊడ్చి శుభ్రం చేశారు.



13వ వార్డులో చెత్త ఊడుస్తున్న కార్పొరేటర్ కెల్ల సునీత

సమాజ సేవలో పాత్రికేయుల పాత్ర గణనీయం

పీఎం పాలెం: ఉత్తమ సమాజ నిర్మాణంలో పాత్రికేయుల పాత్ర కీలకమని నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. శిల్పారామం (జాతర)లో స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీని శనివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాత్రికేయులు అందించే విలువలతో కూడిన సేవలు సమాజహితానికి తోడ్పడతాయన్నారు. అసోసియేషన్ సభ్యులకు డైరీలు, స్వీట్లు పంపిణీ చేశారు. ఎస్‌సీఆర్‌డబ్ల్యూఏ అధ్యక్షుడు బంగారు అశోక్ కుమార్, అసోసియేషన్ గౌరవ సలహాదారు ఎన్.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్యాలు అవసరం



విద్యార్థినికి సర్టిఫికెట్ అందిస్తున్న ఏయూ ఇన్‌చార్జి వీసీ సమత

ఏయూక్యాంపస్: విద్యార్థులు నిరంతరం తమ నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ఆంధ్రా యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత సూచించారు. ఏయూ బయోకెమిస్ట్రీ విభాగంలో నిర్వహిస్తున్న జాతీయ వర్క్‌షాప్ బయోకెమికల్ 2కె23 ముగింపు సమావేశంలో ఆమె పాల్గొన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించే విధంగా వర్క్‌షాప్ నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేసి అధికారులను అభినందించారు. సదస్సు కన్వీనర్ ఆచార్య టి.రాఘవ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ, బయోకెమిస్ట్రీ విభాగాధిపతి ఆచార్య పి.సుభాషిణి దేవి, హై మీడియా ప్రతినిధి జి.రాజేష్ తదితరులు ప్రసంగించారు. అనంతరం వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు, పరిశోధకులకు వీసీ సమత సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

చందనం అలంకరణలో శ్రీవారు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్ – 6లోని వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం తిరుప్పావై సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని 16 కేజీల చందనంతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు శ్రీవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.



చందనం అలంకరణలో వేంకటేశ్వర స్వామి

పరీక్ష కేంద్రాల పరిశీలన

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల పరిధిలో జరుగుతున్న మూడో సెమిస్టర్ పరీక్షా కేంద్రాలను శనివారం ఉదయం ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించడంపై అధికారులను ఆమె అభినందించారు. ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ సాల్మన్ బెన్నీ, డాక్టర్ రాజ మాణిక్యం పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని సమత డిగ్రీ, పీజీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్‌స్టీఫెన్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి వెలిగించి వేడుకలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్రెషర్స్ డే వేడుకలు నూతన, సీనియర్ విద్యార్థులకు మధ్య సమన్వయానికి వారధిగా నిలుస్తాయన్నారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. కళాశాల ప్రతినిధులు ఆచార్య విజయ రవీంద్ర, డాక్టర్ సుంకర రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



వేడుకలు ప్రారంభిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్, ఆచార్య విజయ తదితరులు

శరవేగంగా జాలరిపేట రహదారి నిర్మాణం

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డు పెదజాలరిపేట ప్రధాన రహదారి నిర్మాణం పూర్తికావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. గత కొంతకాలంగా జాలారిపేటలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే ప్రధాన రహదారి నిర్మాణంలో జాప్యం చోటుచేసుకుంది. దీంతో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో జీవీఎంసీ రూ.93.30 లక్షలు కేటాయించింది. ఆ నిధులతో 20 రోజుల క్రితం ఎంపీ ఎంవీవీ శంకుస్థాపన చేయగా, అధికారులు శరవేగంగా రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. వాల్తేర్ డిపో సర్కిల్ నుంచి బాబూజీ నగర్ వినాయకుడి గుడి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డును ఎంవీవీ శనివారం పరిశీలించగా స్థానిక నాయకులు, జాలరిపేట వాసులు హర్షం వ్యక్తం చేయడంతోపాటు సత్కరించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు అభినందనలు తెలుపుతున్న స్థానిక నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- విశాఖ ఎంపీ, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకొంటున్నారని విశాఖ ఎంపీ, తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 11వ వార్డులో శనివారం ముస్తఫాకాలనీ, డ్రైవర్స్ కాలనీ, వివేకానందనగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, కార్యకర్తలతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లారు. మహిళలు, యువకులు, వృద్ధులతో మాట్లాడారు. ఆయా కాలనీల్లో కొన్ని వీధి దీపాలు వెలగకపోవడం, కొన్నిచోట్ల కుళాయిలు సమయానికి రాకపోవడం తదితర సమస్యలు స్థానికుల ద్వారా తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వాటి లబ్ధితో ప్రజలు అవసరాలు తీర్చుకొంటున్నారన్నారు. అందుకే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కావాలని కోరుకొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.



డ్రైవర్స్ కాలనీలో మహిళలతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

అర్చకుల క్రికెట్ టోర్నమెట్ ప్రారంభం

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతానికి చెందిన బాలబాను అర్చక, పురోహిత సంఘం ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ టోర్నమెంట్‌ను విశాలాక్షినగర్ ఏఆర్ పోలీస్ మైదానంలో నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌ను డీఎస్పీ పి.నాగేశ్వరరావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. 12 ఓవర్ల మ్యాచ్‌లలో నాలుగు జట్లు పాల్గొన్నాయి. ఈ జట్లకు మొదట రెండు మ్యాచ్‌లు నిర్వహించారు. అనంతరం విజేతలకు ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. ఫైనల్‌లో శుభ గాయత్రి జట్టుపై కృష్ణ గాయత్రి జట్టు విజయం సాధించింది. నిర్వాహకులు విజేత జట్టుకు ట్రోఫీ, బహుమతులు అందజేశారు.



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు

నేడు కళాభారతిలో నృత్యోత్సవం

మద్దిలపాలెం: స్థానిక కళాభారతిలో ఆదివారం సాయంత్రం నాట్యకళా సన్నిధాలయ నృత్యోత్సవం నిర్వహించనున్నామని నిర్వాహకుడు కన్నం వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్, కాకినాడ, ఏలూరు, గుంటూరు, విశాఖపట్నం ప్రాంతాల్లోని నాట్య కళాకారులు వారి ప్రతిభను ప్రదర్శించనున్నారన్నారు. కూచిపూడి కళాక్షేత్రం ప్రిన్సిపాల్ గురు హరి రామమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొనున్నారని చెప్పారు. కల్యాణ కార్తికేయం నృత్యప్రదర్శన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
7331119904, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ ఈస్ట్
9912220751
Office mail : sakshiadvtvsp@gmail.com